వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 12 ఆగష్టు 2025

## జిల్లాలోని ప్రాజెక్టులకు తరలివస్తున్న కృష్ణా జలాలు

### నిండు కుండలా గండికోట, మైలవరం డ్యాంలు

రాజంపేట, ఆగస్టు 11, ప్రభాతవార్త:


నిండు కుండళా గండికోట రిజర్వాయర్

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కృష్ణాజలాలు తరలివస్తున్నాయి. పై ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా జలాలు గోరుకట్లు రిజర్వాయర్ నుండి తరలివస్తున్నాయి. మరోవైపు బనచకర్ల ప్రాజెక్టు వద్ద కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. హంద్రినీవ కాలువలో జల సవ్వడి వినిపిస్తోంది. గండికోట రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 18.935టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 16.428టీఎంసీల నీరు నిల్వ ఉంది. 11500 క్యూసెక్కుల వరద నీరు గండికోటకు చేరుతోంది. గాలేరు నగరి కాలువకు 10వేల క్యూసెక్కులు విడుదల చేశారు. మైలవరం డ్యాం కాలువ సామర్థ్యం 5.42టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.839టీఎంసీల నీరు నిల్వ ఉంది. 5వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. అధికారులు పెన్నానది ద్వారా 5438 క్యూసెక్కుల నీరును విడుదల చేస్తున్నారు. ఆర్టీపిపికి 36క్యూసెక్కులను విడుదల చేశారు.

## మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా చల్లా కళ్యాణి

మదనపల్లె, ఆగస్టు 11 ప్రభాతవార్త :



మదనపల్లె నూతన సబ్‌కలెక్టర్‌గా చల్లా కళ్యాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా ఉన్న మేఘస్వరూప్ బదిలీ కావడంతో సబ్‌కలెక్టర్‌గా చల్లా కళ్యాణిని నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఈమె ఉదయం రాయచోటిలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలుచేపట్టారు. సబ్‌కలెక్టర్‌కు ఏఓ నిర్మలాదేవి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సబ్‌కలెక్టర్ పిజిఈఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆధారాలతో కూడిన సమస్యలను అర్జీల రూపంలో విన్నవించాలన్నారు. సమస్యను బట్టి గడువులోపల పరిష్కరిస్తామన్నారు.

# అన్ని ఏర్పాట్లు పూర్తి... పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది

జడ్పీ ఓటర్ తీర్పు నేడే... హైకోర్టులో వైసీపీ పిటిషన్ డిస్మిస్... డీఐజీతో కడప ఎంపీ అవినాష్ రెడ్డి భేటీ... ఒంటిమిట్టలో పట్టు బిగించిన మంత్రి మండిపల్లి





రాజంపేట, ఆగస్టు 11, ప్రభాతవార్త:

జడ్పీ ఉప ఎన్నికల తీర్పుకు ఓటర్లు సిద్ధం అయ్యారు. నేడు పోలింగ్ జరిగే పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. రెండు మండలాల్లో పక్కాగా పోలీస్ బందోబస్తును సాయుధ బలగాలు తరలివెళ్లినట్లు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీఐ స్థాయి అధికారులు కూడ మకాం వేశారు. మరోవైపు పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లు పోలింగ్ సామాగ్రితో సిబ్బంది తరలివెళ్లారు. బూత్‌ల వారిగా సామాగ్రిని తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్ పూర్తయింది. పులివెందుల మండలం లో 15పోలింగ్ కేంద్రాలు, ఒంటిమిట్ట మండలంలో 30పోలింంగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్‌కు 24గంటల ముందు వైసీపీ తరపున పులివెందుల మండలంలో పోలింగ్‌కేంద్రాల మార్పుపై లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పోలింగ్ 24గంటల్లో జరగనుండగా ఇప్పుడు జోక్యం చేసుకోమని రిట్ పిటిషన్‌ను తిరస్కరించారు. వెంటనే కడప ఎంపీ అవినాష్ రెడ్డి పులివెందుల మండలంలో పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ జరపాలని కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశాలు ఇవ్వకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని డీఐజీని అవినాష్ రెడ్డి కోరారు. మరో వైపు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వైసీపీ పిటిషన్ కోర్టులో డిస్మిస్ కావడంపై వ్యాఖ్యానిస్తూ ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకే పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు మార్పు జరుగుతాయి తప్ప ఇష్టం వచ్చినట్లు కాదని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ కుప్పిగంతులు వేస్తోందని పేర్కొన్నారు. పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కడప జిల్లా పరిధిలో పులివెందుల మండలంలో జడ్పీ పోలింగ్‌ను కడప ఎస్పీ అశోక్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఒంటిమిట్ట మండలంలో ఎన్నికలను అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు ఎస్పీలు స్వయగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జడ్పీ సీఈఓ ఓబుల్మ, కడప జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ పర్యవేక్షిస్తున్నారు. ఒంటిమిట్ట మండలంలో వైకాపాకు కీలకమైన పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ ఆధిపత్యాన్ని వినియోగించుకునేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. పోలింగ్ ముగిసేంత వరకు ఎక్కడా పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లకుండా ఏజెంట్‌లను పెట్టాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాలపై స్వయంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజుతో కలిసి పర్యవేక్షించారు. ఇంకోవైపు వైసీపీకి ఒంటిమిట్ట మండలంలో కీలకమైన కొత్త మాధవరం, ఒంటిమిట్ట గ్రామ పంచాయతీలతో పాటు కొన్ని గ్రామాల్లో మొదట ఇచ్చిన 2వేలకు తోడు అదనంగా మరో 1000రూపాయలు పంపిణీ చేసినట్లు సమాచారం. తెలుగుదేశం, వైకాపా పార్టీల అధినాయకత్వం జడ్పీ ఉప పోరుపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని తెప్పించుకుంది. పార్టీ కంద్ర కార్యాలయ నుండి ఇరుపార్టీలు ఉప పోరును ఆసక్తిగా చూస్తున్నట్లు సమాచారం. మంత్రి మండిపల్లితో లోకేష్ మాట్లాడినట్లు సమాచారం. మరోవైపు పులివెందుల, ఒంటిమిట్టలో పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డిలతోనూ చర్చించినట్లు సమాచారం. ఏదిఏమైనా ఓటర్ తీర్పు 24గంటల్లో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం కానుంది.






## రైల్వే కోడూరులో రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్


మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంలో మంత్రి నాదెండ్ల మనోహర్

రాజంపేట, ఆగస్టు11 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే పండ్ల తోటలకు ప్రసిద్ధిగాంచిన రైల్వే కోడూరు ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి త్వరలోనే హామీ నెరవేర్చుతామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని మంత్రి సూచించారు. సోమవారం రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాస్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ పగడాల వరలక్ష్మి, వైస్ చైర్మన్ శివయ్య, బోర్డు డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా వరలక్ష్మి, వైస్ చైర్మన్ శివయ్య ఇతర సభ్యులచే మంత్రి ఘనంగా ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవి అనేది బాధ్యతని ప్రజలకు నిజాయితీతోను, నిబద్ధతతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. అహర్నిశలు కృషి చేస్తున్న రైతాంగం కోసం పనిచేస్తూ దళారీ వ్యవస్థ నుండి రైతులను కాపాడాలన్నారు. అత్యధికంగా వాణిజ్య పంటలు పండుతున్న రైల్వే కోడూరులో శీతల గిడ్డంగుల ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. కమిటీ సభ్యులు కొత్త ఆలోచనలతో మార్కెటింగ్ ఆదాయాన్ని పెంచే దిశలో ఆలోచించాలన్నారు. జిల్లాలోని 11 ఎం ఎల్ ఎస్ పాయింట్ల నుండి నిత్యవసర వస్తువులు సక్రమంగా వెళుతున్నాయా లేదా అన్న అంశాలను ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ద్వారా సేకరిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి, వాటిని విజయవంతంగా అమలు చేస్తూ, రైతుల జీవితాల్లో మలుపుతిప్పే మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో మొత్తం 63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 12,000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి కేవలం 24 గంటల్లోనే జమ చేసిన ఘనత సాధించామని పేర్కొన్నారు. రైతులు తమ ఇష్టానుసారం మిల్లులకు ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం కల్పిస్తూ, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా, దీపం పథకం కింద మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలోనే మూడు లక్షల మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేశామని వివరించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 1,240 గ్రామపంచాయతీలలో తీర్మానం చేసిన మేరకు సిమెంట్ రోడ్లు సహా మౌలిక సదుపాయాలను ఉప ముఖ్యమంత్రి కల్పించారని పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వం నెలకు 2,500 కోట్లు పెన్షన్ల రూపంలో నిరు పేదలకు అందజేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వున్న ఆర్థిక పరిస్థితులను అధిగమించి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చామని.... ఆ విషయాన్ని గుర్తించి పార్టీలకతీతంగా ప్రజలకు అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పగడాల వరలక్ష్మి, మాట్లాడుతూ రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెట్ యార్డ్ సదుపాయాల అభివృద్ధి, పారదర్శక విధానాల అమలుపై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జి ,కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్,డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కడప జిల్లా జనసేన అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, పిసిఎన్ బ్రదర్స్ చంద్రశేఖర్,వెంకటేష్, మైసూరు వారిపల్లి సర్పంచ్ సంయుక్త,బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి,జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కమతం నాగరాజు, రవికుమార్‌రాజు, వెంకటేశ్వరరాజు,గునిపాటి చెన్నారాయుడు, సూరపరాజు సుబ్బరాజు,మార్కెట్ కమిటీ సభ్యులు బడుగుంట పల్లె సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, సి శివయ్య, బి రామచంద్ర, యన్ బాలసుబ్రమణ్యం, నాగేశ్వర రాజు, కె శంకరయ్య, కే సుబ్రహ్మణ్యం, కె రజనీకాంత్ రెడ్డి, ఎం సురేఖ, జి పెంచలయ్య, వై నాగేశ్వరి, ఎన్ చిన్న, షేక్ మహబూబ్ బాషా, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలింగు అధికారులు సర్వం సిద్ధం

### పోలీసు కనుసైగలలో ఒంటిమిట్ట మండలం:



ఒంటిమిట్ట .ఆగస్టు. 11(ప్రభాతవార్త)

ఒంటిమిట్ట జడ్పిటిసి ఉపఎన్నిక ప్రచారము ఆదివారంతో ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వ అధికారులు సర్వం సిద్ధం చేసి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సామాన్లను తరలిస్తున్నారు. అత్యంత ప్రధానంగా మండల వ్యాప్తంగా 13 పంచాయతీలు ఉండగా 24066 ఓటర్లు ఉన్నారు. ఓట్ల పోలింగ్ నిమిత్తం ప్రజా సౌకర్యార్థం 30 పోలింగ్ స్టేషనులను ఏర్పాటు చేశారు. పోలింగ్కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం పోలింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికతో సర్వం సిద్ధం చేసి పోలింగ్కు కావలసిన సామాగ్రిని బట్వాడా చేయడం జరిగింది. ప్రతి పోలింగ్ స్టేషన్లో ఒక ప్రెసిడెంట్ అధికారి (పిఓ), అసిస్టెంట్ ప్రెసిడెంట్ అధికారి (ఏపీవో), ముగ్గురు ఓపివోలు కలిపి ఐదు మంది పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలు, బ్యాలెట్ బాక్సులు,ఫారంలు, సీలింగ్ మెటీరియల్, తదితర అన్ని సామాగ్రులు సమకూర్చడం జరిగింది. ఈ ఎన్నికల్లో 650 మంది దాదాపుగా రక్షకబటులు విధులు నిర్వహిస్తున్నారు. భద్రత దృష్ట్యా కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్ ప్లస్ త్రీ పోలీసులను నియమించడంతోపాటు మొబైల్ పార్టీలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామాల వద్ద పోలింగ్ కేంద్రాల వద్ద గందరగోళం, కొట్లాటలు రిగ్గింగులు జరగకుండా ఉన్నత స్థాయి పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న పోలీసులు భద్రతను పటిష్టం చేస్తున్నారు. ప్రత్యేక నిగా పెట్టడం జరిగింది. ఉదయం 7:00 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పోలింగ్ అధికారులు స్పష్టం చేశారు. ఏది ఏమైనప్పటికీ ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంత వాతావరణ మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి రక్షణగా పోలీసు బలగాల కనుసైగల్లో నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు పోలీసు బలగాలు, పోలింగ్ అధికారులు స్పష్టం చేయడం జరిగింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయం వరకు పోలింగ్ నిర్వహిస్తామని ఓటర్లు సమయాన్ని వృధా చేసుకోకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చని ఏ విషయంలోనూ భయపడవద్దని మండల ప్రజలకు తెలపడం జరిగింది.

## మాజీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రెడ్డి గుండెపోటుతో మృతి

రాజంపేట, ఆగస్టు 11 ప్రభాతవార్త



రాజంపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ కసిరెడ్డి మదన్మోహన్ రెడ్డి (78) గుండెపోటుతో కన్నుమూశారు. సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో చాతీలో నొప్పి రావడంతో కుప్పకూలారు. ఆసుపత్రికి తీసుకువెళ్లే లోపే ఆయన మరణించారు. మదన్ మోహన్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1989లో ఆయన రాజంపేట శాసనసభ్యునిగా గెలుపొందారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ,రాజంపేట మాజీ ఎంపీ ఏ సాయి ప్రతాప్ , మదన్మోహన్ రెడ్డిలు ఒకే బ్యాచ్ కి చెందిన మిత్రులు. వైయస్ సహకారంతోనే ఆయన రాజకీయాల్లోకి రావడం, శాసనసభ్యునిగా గెలుపొందారు. ఆ తర్వాత వైయస్ తో విభేదించారు. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి వర్గంలో చేరారు. ఆ తర్వాత రెండు సార్లు రాజంపేట నుంచి పోటీ చేసి ఓడిపోయారు. నిజాయితీ శాసనసభ్యులుగా మదన్ కు పేరుంది. 1989 94 ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మారుమూల గ్రామాల్లో కూడా ఆయన అభివృద్ధి చేశారు. ప్రత్యేక వర్గాన్ని ఏర్పరచుకున్నారు. తెలుగుదేశం పార్టీలో కూడా ఐదేళ్లపాటు ఉన్నారు.2004లో కాంగ్రెస్ టికెట్ కు ప్రయత్నించి రాకపోవడంతో విభేదించి టిడిపిలో చేరారు. సమకాలిన రాజకీయాల్లో మదన్మోహన్ రెడ్డి రాజంపేట నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకున్నారు. మదన్మోహన్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఆయన వర్గీయుల్లో విషాదం నెలకొంది.ఆయన ఆయన అంత్యక్రియలు మంగళవారం హైదరాబాదులోనే జరిగనున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

## ఐటిబిపి మిలిటరీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

పీలేరు ఆగస్టు 11 ప్రభాతవార్త :

నియోజకవర్గంలోని కలికిరిలో ని ఐటిబిపి కార్యాలయం నందు అధికారులు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఆగస్టు 15 దినోత్సవాన్ని స్వాతంత్ర దినోత్సవంగా భావించి కలికిరి ఐటిబిపి మిలిటరీ పోలీసులు ఇంటింటికి స్వాతంత్ర దినోత్సవం అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఐటిబిపి అధికారులు తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలికిరి చుట్టుపక్కల ప్రజల సైతం 53 బెటాలియన్ ఐడిబిఐ సిబ్బందికి ఘనంగా స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు మునిపెన్నడు లేని విధంగా కలికిరి పట్టణములు ఐటిబిపి సిబ్బంది తోపాటు అధికారులు ప్రజలు పాల్గొని ఘనంగా స్వాతంత్ర దినోత్సవాన్ని జరుపుకుండటం చూస్తే దేశంపై మిలిటరీ సిబ్బందికి ఉన్న గౌరవం క్రమశిక్షణ ఏ పార్టీతో తెలుస్తుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

## ఉపఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం

### 15 పోలింగ్ కేంద్రాలు, 99 మంది సిబ్బంది

పులివెందుల , ఆగస్ట్ 11, ప్రభాత వార్త :



నేడు జరిగే ఉపఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు మొత్తం 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 99 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తునట్లు రిటర్నింగ్ అధికారి వేంకటపతి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక పోలింగ్ కేంద్రంలో పిఓ, ఏపీఓతో పాటు ముగ్గురు ఇతర సిబ్బంది నీ నియమించి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఎన్నికల సామాగ్రిని వారికి అప్పగించి ప్రత్యేక వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు చేర్చడం జరిగిందన్నారు.ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం 15 మందిని మైక్రో అబ్జర్వ్ లను నియమించామన్నారు. అలాగే రిజర్వ్ స్థానంలో కూడా కొంత సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1 వ పోలింగ్ లో 620, 2 లో 623, 3 లో 492, 4 లో 499, 5 లో 636, 6 లో 834, 7 లో 834, 8 లో 556, 9 లో 556, 10 లో 556, 11 లో 565 , 12 లో 667 13 లో 1288 14 లో 1273, 15 లో 602 ఓట్లు ఉన్నాయి. గ్రామాల వారీగా రాగిమానుపల్లి లో 1243, అచ్చువెల్లి లో 991, ఎర్రిపల్లి లో 636, ఎర్రిపల్లి 1 లో 2224, ఎర్రిపల్లి 2 లో 1677, ఈ కొత్తపల్లి లో 3228, కనంపల్లె లో 602 ఓట్లు ఉన్నాయి.మొత్తం 10601 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు.

ఎన్నికలు సజావుగా జరిపించడానికి ఏర్పాటు చేసినట్లు డిఎస్పి మురళి నాయక్ తెలిపారు.12వ తేదీ పోలింగ్ సందర్భంగా ఇద్దరు అదనపు ఎస్పీలు, ముగ్గురు డిఎస్పీలు, 20 మంది సిఐలు, 50 మంది ఎస్సైలు , 421 మంది పోలీస్ సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు డి.ఎస్.పి మురళి తెలిపారు.

# రెండు దశాబ్దాల తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు : మంత్రి సవిత

ఎర్రగుంట్ల ఆగస్టు 11 ప్రభాతవార్త

కడప జిల్లా ఎర్రగుంట్ల జువారి సిమెంట్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్ లో సోమవారం జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ గతంలో బాబాయ్ గొడ్డలిపోటును నారా వారి చరిత్ర అని సాక్షిలో రాయడం చూసాం,జగన్మోహన్ రెడ్డి అవినాష్ రెడ్డిలకు సేవ్ డెమోక్రసీ అంటే కూడా అర్థం తెలియదు వాళ్లు సేవ్ డెమోక్రసీ అంటున్నారు.ఈరోజు పులివెందుల ప్రజలే అనుకుంటున్నారు ఎప్పుడు ఈ విధంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగలేదని గతంలో వైసిపి వారు కూడా ఓటు అడిగే వారు కాదని ఇప్పుడు వైసీపీతో పార్టీ అన్ని పార్టీలు ఓటు అడుగుతున్నాయంటే ఇది ప్రజాస్వామ్యం అని అందరికీ అర్థమవుతుంది,జగన్ భారతి ఓటమి భయంతో బెంగళూరు నుండి రైతులకు యువకులకు ప్రజలందరికీ ఓటు వేయమని ఫోన్ చేసి మరీ అడుగుతున్నారు పోలీసులను అడ్డుపెట్టుకొని ఎన్నికలు జరపాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి లేదు అని సవిత అన్నారు.గత ఐదు సంవత్సరాలు దోచుకుని దాచుకొని ప్రజలను భయభ్రాంతులను చేసి హత్యలు చేసి ఏ విధంగా ఎన్నికలు జరిపారో ప్రజలందరికీ తెలుసు అందుకే వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారని సవిత అన్నారు. సతీష్ రెడ్డి లోకేష్ తో ప్రాణహాని ఉంది అంటున్నారు మీ పార్టీలో ఉండే వారితోనే మీకు ప్రాణహాని ఉంది అని తెలుసుకోవాలి.మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధిపై రెచ్చిపోతారు కానీ రఫ్ఫా రఫ్ఫా నరకడానికి సహకరించరు ఒప్పుకోరు పులివెందులలో డిఎస్పీని బెదిరించింది ఎవరు? పార్టీ మారిన వారిని ఫోన్లు చేసి బెదిరించింది ఎవరని మంత్రి సవిత ప్రశ్నించారు. జెడ్పిటిసి ఉప ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీతో గెలుపొందుతామన్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, కాశీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎర్రగుంట్ల మండల ఇంచార్జి మధుసూదన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రాథమిక హక్కులు కాలరాస్తున్న ఎన్నికల కమిషన్

పులివెందుల, ఆగస్ట్ 11, ప్రభాత వార్త :



భారతీయ పౌరుడికి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ ప్రాథమిక హక్కును భారత రాజ్యాంగం కల్పించిందనీ అయితే పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో ప్రాథమిక హక్కును ఎన్నికల కమిషన్ కాలరాస్తోందని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. స్థానిక జగన్ క్యాంప్ కార్యాలయం నందు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ముందు రోజున మీడియా సమావేశం ప్రజలకి ముఖ్యమైన విషయాన్ని తెలియ చేయడానికి పెట్టాల్సి వచ్చింది అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి తత్తులుగా పనిచేస్తుందని ప్రజాస్వామ్యకూని అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పోలింగ్ కేంద్రం ఉండి కూడా గ్రామస్తులు ఓటు వేయలేక పక్క పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి చరిత్రలో ఎప్పుడు లేదన్నారు.

పోలింగ్ కేంద్రాలను మార్చడంతో సరిపెట్టుకోకుండా మరో కొత్త కుట్రకు టిడిపి తెర లేపిందని ఈ కుట్రలను ఎన్నికల కమిషన్ గమనించాలని, ప్రతి గ్రామానికి వెళ్లి ఓటుకు డబ్బులు పంచి వారి ఓటర్ స్లిప్పులను తీసుకోవడం జరుగుతుందని దీనితో పోలింగ్ కేంద్రాలు మార్చినందున వారు ఎక్కడ ఓటు వేయాలో కూడా తెలియని పరిస్థితి ఉందని కావున టిడిపి నాయకులు తీసుకున్న ఓటర్ స్కిప్లను అర్ధ రాత్రి సమయానికి తిరిగి ఓటర్లకు ఇచ్చేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాల న్నారు. దొంగ ఓట్లు వేయడా నికి ప్రొద్దుటూరు జమ్మలమడు గుల నుంచి బయట జనాన్ని ఉంచారన్నారు. ఇ.కొత్తపల్లి, నల్లపరెడ్డిపల్లె, నల్లగొండువారి పల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్ళి డబ్బులిచ్చి ఓటర్ల స్లిప్పులను ఇవ్వకపోతే బెదిరిస్తున్నారనీ టీడీపీ కుట్రలను గురించి మూడు రోజులుగా ఎన్నికల కమిషన్ దృష్టికి పదేపదే తీసుకెళ్లామని ఆయన ఎన్నికల కమిషన్ మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. స్లిప్పు లేకపోతే ఓటు ఎక్కడ ఉందో ఓటర్ కు అర్థం కాని పరిస్థితి నెలకొందని ఓటరుకి తమ ఓటు హక్కుని వినియోగించుకునే అవకాశం కల్పించాలనీ ప్రతి ఒక్క ఓటరికీ మళ్లీ స్లిప్పులను అందించాలన్నారు. ఇప్పటికే వైకాపా నాయకులను ఎక్కడికి అక్కడ పోలీసులు అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని న్యాయబద్ధంగా ఎన్నికలను నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ మరియు పోలీసులను కోరారు.

## తలసరి జీడీపీలో ప్రపంచంలో భారత్‌ది 137 వ స్థానం

వేంపల్లి: ఆగస్టు 11 (ప్రభాత వార్త):

నరేంద్ర మోడీ గారి 11 ఏళ్ల పాలనలో భారత దేశము ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ,త్వరలో 3 వ స్థానంలో చేరుకుంటామని నరేంద్ర మోడీ, బిజెపి నాయకులు పదేపదే చెబుతూ ఉంటారు.ఇందులో వాస్తవము లేదు.ఇది మసిపూసి మారేడు కాయ చేయడమే .ఇది వాపు మాత్రమే .బలం కాదు అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ 2025 నివేదిక ప్రకారంగా తలసరి జిడిపిలో ప్రపంచం లోని 191దేశాలలో భారత దేశపు స్థానము 137.మన దేశపు తలసరి జిడిపి 2 878 డాలర్లు.ఒక్క లక్ష 40 వేల 941 డాలర్లతో నంబర్ వన్ స్థానం లగ్జంబర్గ్. ఐర్లాండ్ ఒక్క లక్ష 8 వేల 919 డాలర్లతో 2 వ స్థానంలో, స్విట్జర్లాండ్ 1 లక్షా,నాలుగు వేలా,896 డాలర్లతో 3 వ స్థానంలో,సింగపూర్ 92,932 డాలర్లతో 4 వ స్థానంలో ఉన్నాయి.మనమేమో 2,878 డాలర్లతో 137 వ స్థానంలో ఉన్నాము. అమెరికా కూడా తలసరి జిడిపి లో ఏడవ స్థానంలో ఉంది.కానీ టోటల్ జీడీపీలో మొదటి స్థానం. ఎందుకంటే జనాభా ఎక్కువ. చైనా కూడా తలసరి జిడిపిలో 70 వ స్థానంలో ,కానీ టోటల్ జీడీపీలో రెండవ స్థానం. కారణం జనాభా 142 కోట్లు. జర్మనీ తలసరిం జిడిపిలో 17 వ స్థానంలో,కానీ టోటల్ జీడిపిలో మూడో స్థానం. జనాభా ఎనిమిది కోట్లు కాబట్టి భారతదేశము తలసరి జిడిపిలో 137 వ స్థానం ,కానీ టోటల్ జీడీపీలో నాలుగో స్థానం .కారణం 144 కోట్ల జనాభా ఉంది కాబట్టి. జనాభా ఎక్కువ కాబట్టి టోటల్ జిడిపిలో ఎక్కువ కనిపిస్తుంది కానీ తలసరి జిడిపిలో మనం ఎక్కడో క్రింద ఉన్నాం .137 వ స్థానంలో ఉన్నాం.ఇది వాపు తప్ప బలుపు కాదు అని తులసి రెడ్డి వివరించారు.

## కలికిరి వైసీపీ మండల కార్యదర్శిగా ద్వారకనాథ్‌రెడ్డి

కలికిరి, ఆగస్టు 11, ప్రభాతవార్త:



కలికిరి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా గుట్టపాలెం పంచాయతీ దిగువ కంభంవారిపల్లెకు చెందిన కంభం ద్వారకనాథ్‌రెడ్డిని నియమిస్తూ అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం కలికిరి మండలంలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో జరిగిన కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మాజీ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ డా.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్, వైసీపీ సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డిలు ద్వారకనాథ్‌రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు వెంకట మిథున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి తనను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందని వారి ఆదేశాలతో గ్రామంలో వైసీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శివాజీ

కలికిరి, ఆగస్టు 11, ప్రభాతవార్త:



కలికిరి మండలం మర్రికుంటపల్లె పంచాయతీ వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా శివయోగి శివాజీని నియమిస్తూ అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ నియామక పత్రాలను వైసీపీ కార్యకర్తల సమావేశంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శివాజీకి అందజేశారు. ఈ సందర్భంగా శివయోగి శివాజీ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి తనను గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమన్నారు. వైసీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివాజీ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్‌గా లక్ష్మీప్రసన్న

కలికిరి, ఆగస్టు 11, ప్రభాతవార్త:

కలికిరి-వాల్మీకిపురం రోడ్డు మార్గంలో ఉన్న వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్‌గా లక్ష్మీప్రసన్నను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వ్యవసాయ ప్రిన్సిపల్‌గా పనిచేసిన సుబ్రమణ్యంను కడప జిల్లా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి బదిలీ చేయడం జరిగింది. గతంలో పనిచేసిన వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యంపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఉన్నతాధికారులు విచారణ జరిపి ప్రిన్సిపల్ సుబ్రమన్యంపై వేటువేశారు. ఆయన స్థానంలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్‌గా పనిచేస్తున్న లక్ష్మీప్రసన్నను వ్యవసాయ ప్రిన్సిపల్‌గా నియమించారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

## రాహుల్ గాంధీ అరెస్ట్ పై మండిపడ్డ...

పీలేరు ఆగస్టు 11 ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లా పీలేరు నియోజవర్గం రాజంపేట పార్లమెంట్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సంపత్ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టుపై మండిపడ్డారు భారతీయుడు పవిత్రమైన ఓటు హక్కు వ్యవస్థను కాపాడాలని ఉద్యమిస్తున్న రాహుల్ గాంధీని సహా విపక్ష నేతలను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు ప్రశ్నించే గొంతుకు అడ్డుకోవడం అంటే మోడీ నియంతకు పోకడల నిదర్శనమని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే స్వేచ్ఛ లేకుండా బాధ కరం ఈ దేశానికి పట్టిన దుస్థితి దేశ భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ సంకల్పం అని అన్నారు నిర్బంధాలు జైలు ఏవి అడ్డుకోవాలని ఆయన తెలిపారు.

## అదుపుతప్పి లోయలో పడ్డ లారీ

రామపురం ఆగస్టు 11 ప్రభాతవార్త :

కర్నూలు చిత్తూరు 40వ జాతీయ దారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు ఘాటు రెండవ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిమెంటు లారీ లోయలో పడి డ్రైవర్ ధనుంజయకు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా బంగారు పాలెం కు చెందిన లారీ డ్రైవర్ ధనుంజయ ఎర్రగుంట్ల నుంచి బెంగళూరుకు సిమెంటు తీసుకువెళ్తుండగా గువ్వల చెరువు రెండవ మలుపు వద్దకు రాగానే లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో వాహనము అదుపు తప్పి లోయలో సంఘటన స్థలానికి స్థానికులు సహాయంతో డ్రైవర్ ను బయటికి తీసి రక్షించారు. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్ కు తరలించారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 40మంది గర్భవతులకు వైద్య పరీక్షలు



దువ్వూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద 40మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్లు సురేష్ బాబు, రోషిణి, హేమలతలు తెలిపారు. వివిధ గ్రామ సచివాలయాల నుండి 40మంది గర్భవతులు రాగా వారిలో 18మంది కష్టతరమైన కాన్పులు జరిగే అవకాశాలు ఉన్నందున వారికి స్కానింగ్ నిర్వహించి మందులు అందజేసి పలు సలహాలు, సూచనలు చేశారు. అలాగే గర్భవతులకు బరువు, హైబీపీ, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో పంపిణీ చేసే ప్రోటీన్స్ గల తిండి పదార్థాలు, కోడిగుడ్లు తీసుకోవాలని అలాగే రాగిజావ, ఆకుకూరలు ఎక్కువగా వాడాలన్నారు. కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగే విధంగా చూసుకోవాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందజేసే సురక్ష, జనని శిశురక్షణ, శిశు సురక్ష వంటి కార్యక్రమాల ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, బయన్న తదితరులు పాల్గొన్నారు.

## దువ్వూరులో భారీ వర్షం

దువ్వూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు చుట్టుప్రక్కల గ్రామాలలోనూ సోమవారం ఉదయం, సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో మొదటి సారిగా వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. చాగలమర్రి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో ఒక్కిలేరు వంతెనకు వర్షపు నీరు ఎక్కువగా వచ్చింది. అలాగే నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడంతో కుందూ నదికి రాజోలి వద్ద 17120 క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తున్నట్లు కేసీ కాలువ ఏఈ జమాల్ వల్లి తెలిపారు. ఉదయం 15వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా సాయంత్రానికి 17120 క్యూసెక్కులకు చేరినట్లు తెలిపారు. రాత్రికి ఇంకా కుందూ నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే దువ్వూరులోని అలుగు వంకలో కూడ నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏదిఏమైనా గత 2రోజులుగా అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి.

## సింగిల్ విండో అధ్యక్షునిగా ఖాదర్ బాష నియామకం

రాజుపాళెం, ఆగస్టు 11, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని పి.టంగుటూరు సహకార పరపతి సంఘం చైర్మెన్‌గా టంగుటూరు గ్రామానికి చెందిన ఎం.ఖాదర్ బాషను చైర్మెన్‌గా, పర్లపాడు గ్రామానికి చెందిన బీరం వెంకల కొండారెడ్డి, అయ్యవారి పల్లెకు చెందిన గోపు వెంకటేశ్వర్లు సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ సంధర్భంగా సోమవారం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని చైర్మెన్ ఎం.ఖాదర్ బాష కలిసి కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం ను అందజేశారు. ఈ సంధర్భంగా ఖాదర్ బాష మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సహకారంతో ప్రభుత్వం బాధ్యతలు అప్పగించినందుకు పదవికి న్యాయం చేస్తానని, రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.



## అమ్మవారిశాల అభివృద్ధికి కృషిచేయాలి



బద్వేలు అర్బన్, ఆగస్టు 11 , ప్రభాతవార్త :

ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ కనుమర్ల పూటి ప్రసాద్‌ను సోమవారం అపార్ట్‌మెంటులోని వారి స్వగృహంలో మాజీ ఆర్యవైశ్య వర్తకసంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, కొలిశెట్టి నాగరాజ, మునగా చలమయ్య, ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్, దర్శి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు మాజీ కమిటి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించి పూలమాలు వేసి అభినందించారు. అనంతరం బాలాజీ గ్రూపు ఎండీ కేవి.సుబ్బారావు, కొలిశెట్టి నాగరాజలు మాట్లాడుతూ ఆర్యవైశ్యవర్తక సంఘం నూతన కమిటిగా ఎన్నికైన గౌరవాధ్యక్షులు మా మిత్రుడు కనమర్లపూటి ప్రసాద్ మరియు అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరి ఉరిమి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారిశాల అభివృద్ధికి మరింత పాటుపడాలని ఆకాంక్షించారు. అలాగే కనమర్లపూటి ప్రసాద్‌ను పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు విశేష సంఖ్యలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బచ్చు సుధాకర్, బెస్తవేముల సుబ్బారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మవారికి వడిబియ్యం




బద్వేలు అర్బన్, ఆగస్టు 11 , ప్రభాతవార్త :

బద్వేలు పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని సోమవారం వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, సెక్రటరి తులసి వసుంధర ,ట్రెజరర్ ఉరిమి పద్మతో పాటు పలువురు కమిటిసభ్యుల ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జూటూరు సుదర్శన్ సతీమణి లక్ష్మి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పలువురు మహిళల ఆధ్వర్యంలో వడిబియ్యం కార్యక్రమాన్ని సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటి సభ్యులు పీవీఎన్ ప్రసాద్, సెక్రటరీ కొలిశెట్టి రమేష్‌లు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమల మహాలక్ష్మిదేవాలయం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## గౌరవాధ్యక్షులుగా కొండపల్లి చిన్నసుబ్బారావు

బద్వేలు అర్బన్, ఆగస్టు 11 , ప్రభాతవార్త :



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాల కమిటి అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావును కడపజిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) గౌరవాధ్యక్షులుగా నియమించినట్లు అధ్యక్షులు కాసంశెట్టి సుధాకర్ గుప్తా తెలిపారు. ఆదివారం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథుగా విచ్చేసిన కడపజిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు కాసంశెట్టి సుధాకర్ గుప్తా, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ చిప్పగిరి ప్రసాద్ చేతుల మీదుగా కొండపల్లి సుబ్బారావుకు జిల్లా గౌరవాధ్యక్షులుగా నియామక పత్రాన్ని అందించారు. అనంతరం కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో విశ్వాసంతో బద్వేలు పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓట్లు వేసి అధ్యక్షులుగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. తమ సేవలను గుర్తించి జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులుగా నియామక పత్రం అందించడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఇందుకు బద్వేలు పట్టణంలోని ఆర్యవైశ్యులందరికీ మరియు జిల్లాలో వైశ్యులకు కూడా తాము అందుబాటులో ఉండి ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానది

సిద్ధవటం ఆగస్టు 11 ప్రభాతవార్త :

మండలకేంద్రమైన సిద్ధవటం లోలెవల్ కాజ్వే పై సోమవారం పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో, నదీ పరివాహక ప్రాంతాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెన్నానది లోకి వరద నీరు వచ్చి చేరింది. పెన్నానది లోలెవల్ కాజ్వేపైకి ఎవరిని వెళ్లనీయకుండా ఎస్ఐ మహమ్మద్ రఫీ ఇరువైపులా ముళ్లకంపను వేయించారు. నదిలో సుడిగుండాలు ఉన్నాయని కొత్త వ్యక్తులు, స్థానికులు నదిలోకి ఎవరూ దిగవద్దని ఆయన హెచ్చరించారు. చేపలు లోలెవల్ కాజ్వే పై పడుతుండడం పట్టేందుకు కొందరు యువకులు ప్రమాదం జరుగుతుందని తెలిసినా లోలెవల్ కాజ్వే వద్దకు వెళుతుండడం విశేషం.



## రక్షాబంధన్ విశిష్టతను తెలియజేసిన ఓం శాంతి సభ్యులు



బద్వేల్ అర్బన్, ఆగస్టు 11, ప్రభాతవార్త

ఓం శాంతి బ్రహ్మకుమారి ఈశ్వర్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రక్షాబంధన్ సందర్భంగా పలువురు బ్రహ్మకుమారీలు సోమవారం అధికారులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ విశిష్టతను తెలియజేస్తూ భగవంతుని రక్షణలో ఉండటమే రక్షాబంధనం అని, ఆధ్యాత్మికమైన రాజయోగము జ్ఞానము గురించి వివరించారు. అనంతరం బ్రహ్మకుమారి సిస్టర్ ఆర్డిఓ చంద్రమోహన్ రాజు, కమిషనర్ మున్సిపల్ కమిషనర్ వాకమళ్ళ వెంకట నరసింహారెడ్డి, బద్వేల్ తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు, మరియు మున్సిపల్ ఏఈ డి ఈ లు వీఆర్వోలు ఆర్ఐలు తోపాటు పలువురికి బ్రహ్మకుమారి రక్షాబంధనం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో రాజస్థాన్ నుంచి విచ్చేసిన బి.కె సోమేష్ మరియు బి.కే సుధారాణి ద్వారా రక్షాబంధనం జరిగినది.

## 13న ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం

బద్వేల్ అర్బన్, ఆగస్టు 11, ప్రభాతవార్త,

ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు సబ్ డివిజన్ పరిధిలోని బద్వేలు గోపవరం అట్లూరు, బి. మటం అలాగే మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు ,వనిపెంట, ఖాజీపేట, పోరుమామిళ్ల సబ్ డివిజన్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాసినాయన, మరియు బి కోడూరు మండలాలకు సంబంధించి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కొరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు యొక్క పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు

## ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోండి..!..

### ఓటర్లకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సందేశం..

కడప కలెక్టరేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త,

పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో జరిగే జడ్పిటిసి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో.. ఓటర్లందరూ ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం సందేశాన్నిచ్చారు. పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో మంగళవారం (ఈ నెల 12న) ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జడ్పిటిసి ఉప ఎన్నికలను.. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు పకడ్బందీగా కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. బ్యాలెట్ బాక్స్ ల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ మెటీరియల్ ను ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించడం జరిగిందన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంకనూ ఎవరైనా స్లిప్పులు అందని వారు ఉంటే.. మిగిలినవి ఆదివారం రాత్రిలోపు సంబంధిత బి.ఎల్.ఓ. వద్ద తీసుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్పులు లేకపోయినా తమ గుర్తింపు కార్డుతో వెళ్లి సంబంధిత బూత్ లలో వారి వివరాలు తెలియజేసి.. ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్లు తప్పకుండా తమ వెంట ఫోటో గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణ, వెబ్ కాస్టింగ్ తో పాటు ఆ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేని మైక్రోఅబ్సర్వనుకూడా నియమించడం జరిగిందన్నారు. వెబ్ కాస్టింగ్ లేని పోలింగ్ స్టేషన్లో వద్ద మైక్రోఅబ్సర్వను నియమించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్లో వద్ద త్రాగునీరు, మెడికల్ ఎమర్జెన్సీ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ జరిగే అన్ని గ్రామాలకు పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సిస్టం సంబంధించి ఆర్టీసీ బస్సులు, ఆటోలను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని పోలింగ్ బూతుల వద్ద నలుగురు సిబ్బందితో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా కట్టుతిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఏవైనా అనవసరమైన, ఉద్వేగపూరితమైన, రెచ్చగొట్టే వదంతులు ప్రసారం చేసినా.. స్పందించకుండా ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో నిలబడిన వారందరికీ ఓటు వేయడానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పోలింగ్ లో పాల్గొని తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తన అమూల్యమైన సందేశాన్నిచ్చారు.



## కుటుంబ సమస్యలతో డ్రైవర్ ఆత్మహత్య

మదనపల్లెక్రైమ్, ఆగస్టు 11 ప్రభాతవార్త.



కుటుంబ సమస్యలతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండల కేంద్రానికి చెందిన బాలయ్య కుమారుడు అనిల్(35) బి.కొత్తకోట మండలం బడికాయలపల్లి కి చెందిన స్వరూప ను 12ఏళ్ళ క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి అరేళ్ల కుమారుడు జేమ్స్, నాలుగేళ్ల కుమార్తె లిప్సిక ఉన్నారు. వీరు రెండేళ్ల క్రితం మదనపల్లె మండలం, నిమ్మనపల్లి రోడ్డు లోని బసినికొండకు వచ్చి నివాసం ఉంటున్నారు. అనిల్ టిప్పర్ డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ నేపథ్యంలో కుటుంబ ఖర్చులు పెరగడంతో స్వరూప తిరుపతిలోని ఓ ప్రైవేట్ రెస్టారెంట్లో పని చేసుకుంటూ అక్కడే ఉండేది. వీరి పిల్లలు బడికాయలపల్లిలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. ఈ నేపథ్యంలో అనిల్ తను ఆటో కొనుక్కోవాలని, రూ.30 వేలు డబ్బులు కావాలని తిరుపతిలో ఉన్న భార్య స్వరూప కు ఫోన్ చేశాడు. ఇప్పట్లో అమోంట్ కుదరదని చెప్పడంతో ఇద్దరు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్ ఇంట్లో ఒంటరిగా ఉండడంతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు రోజుల తర్వాత చుట్టుపక్కల దుర్వాసన వెధ జల్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మృతుడి భార్య స్వరూప కు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పేరు మార్పు

బోరన్న గారి వీరయ్య తండ్రి బోరన్న గారి వీరయ్య (పాత పేరు) ఇంటి అడ్రస్: 22/45A వేపరాల గ్రామం,మైదుకూరు (మం) కడప జిల్లా,ఏపీ., వీరు యాదవ్ బోరన్న గారి (కొత్త)పేరుగా మార్చుకోవడమైనది గమనించగలరు. ఫోన్ 8520036591

## విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో
# ఘనంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం

**కురబలకోట ఆగస్టు 11 ప్రభాతవార్త**



అంగల్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన బి. టెక్ విద్యార్థులకు వారి తల్లితండ్రులకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రమణా రెడ్డి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్. జి. హెచ్. గౌడా, డైరెక్టర్, ఇన్ఫో బెల్, ఐటీ సొల్యూషన్స్, బెంగళూరు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థులు స్కిల్ డెవలప్మెంట్ లో మెరిట్ గా ఉంటేనే ఉద్యోగాలు మెండుగా వస్తాయని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ ETHNUS, బెంగళూరు జేమ్స్ క్రిస్టి మాట్లాడుతూ విద్యార్థులు కాలేజీ లైఫ్ నుండి కార్పొరేట్ స్థాయికి ఎదగాలని తన తెలివితేటలు మరియు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, జె. ఎన్. టి యూ, అనంతరం, డా. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీ అకాడమిక్ స్కిల్ ఓరియెంటెడ్ నైపుణ్య కోర్సు లకు దీటుగా విద్యార్థులు పోటీ పడి చదవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రమణా రెడ్డి మాట్లాడుతూ ఈ బ్యాచ్ తో అటానమస్ రెండవ సంవత్సరం ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు మంచి కళాశాలను ఎంపిక చేసుకోవడం లోనే వారి విజయం దాగి ఉందని, వారి కృషికి కళాశాల కల్పిస్తున్న అవకాశాలు ఉత్తమ బోధన తోడైతే ఉన్నత శిఖరాలు చేరవచ్చని అన్నారు, విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చివరివరకు కృషి చేయాలి అని అప్పుడే విజయం వరిస్తుంది అని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాల కు అనుగుణంగా కష్టపడి వారి ఆశయాలు నెరవేర్చాలన్నారు, విశ్వం గ్రూప్ చైర్మన్ శ్రీ ఎం. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మంచి అధ్యాపక బృందంతో ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడం ఒక్క విశ్వం ఇంజినీరింగ్ కళాశాల కే సాధ్యమన్నారు. కళాశాల కు అటానమస్ వచ్చిన తర్వాత ఇది రెండవ బ్యాచ్ అని వీరిపై మాకు మరింత బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి రమణా రెడ్డి, డీన్స్, విభాగ అధిపతులు వారి తల్లిదండ్రులు మరియు, బి.టెక్ విద్యార్థులు వారి తల్లి తండ్రులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉచితంగా మొక్కలు పంపిణీ



**గాలివీడు, ఆగస్టు 11(ప్రభాతవార్త):**

రెడ్స్ మరియు సేవ్ ట్రీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసినట్లు రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు తెలియజేశారు. సోమవారం మండలంలోని పలువురు రైతులకు మొక్కలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, పెద్దమండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాల్లో బోరు కలిగి నీటి సదుపాయం ఉన్న రైతులు తమ సిబ్బందిని 897717 8283 నెంబర్లో సంప్రదిస్తే మామిడి, సపోటా, నేరేడు, నిమ్మ తదితర మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ ట్రీస్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అరుణ్‌కుమార్, రెడ్స్ ఫీల్డ్ కోఆర్డినేటర్ కిరణ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

## కోట నుంచి విద్యార్థుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**సిద్ధవటం ఆగష్టు 11 ప్రభాతవార్త**

మండలకేంద్రమైన సిద్ధవటం కోట నుంచి సోమవారం జాతీయ జెండాలు చేతబట్టుకుని విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ నెల 2 నుంచి 15 వరకు ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కడప జిల్లా పురాతత్వ సర్వేక్షణ కన్సర్వేషన్ అసిస్టెంట్ ధాకా రెడ్డి ఆధ్వర్యంలో ఎంటీఎస్ స్వరూప్ రామ్ సిద్ధవటం కోట నుంచి ప్రధాన రహదారి గుండా విద్యార్థులు భారత్ మాతాకి జై అంటూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప్ రామ్ మాట్లాడుతూ 1947 ఆగస్టు పదిహేనున భారతదేశం వందల ఏళ్ళ బానిసత్వాన్నుంచి విడుదలయిందన్నారు. దానికి గుర్తుగా, స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఆగస్టు పదిహేనుని భారత స్వాతంత్ర్య దినోత్సవంగా, జాతీయ శెలవు దినంగా ప్రకటించి అమలు చేస్తోందన్నారు. ఆగస్టు పదిహేను విశిష్టత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకూమార్ యాదవ్ కలిసిన బి.పి ప్రతాప్ రెడ్డి,

**మైదుకూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:**

వై.యస్.ఆర్. కడప జిల్లాలో నాఫెడ్ సంస్థకు భూమి కేటాయింపు పైన మైదుకూరు బిజెపి సీనియర్ నాయకుడు బిపి ప్రతాప్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య వైద్య విద్య శాఖమాత్యులు వై.సత్య కుమార్ యాదవ్ తో కలిసి నాఫెడ్ సంస్థ 1886వ సంత్సరములో అనుబంధ సంస్థ యన్.హెచ్. ఆర్.డి.ఎఫ్ అను సంస్థకు నాఫెడ్ సంస్థకు కేటాయించిన భూమిలో మిగిలిన 9 ఎకరముల పైచిలుకు భూమి నాఫెడ్ సంస్థకు కేటాయిస్తే రైతులకు లబ్ధి చేకూరే విధముగా గోదాములు,ఇమండి, రైతులకు వసతి కేంద్రము ఏర్పాటు చేస్తామని 2017లో ప్రతిపాదన చేశారు. కాని వై.యస్.ఆర్. కడప జిల్లా కలెక్టరు జాతీయ రహదారి నెం.40కి యిరువైపుల వున్న భూమిలో రహదారికి తూర్పు వైపున వున్న సర్వే నెం. 1125, 1126లోని 7 ఎకరముల భూమి కేటాయింపుకు సిద్ధపడినారు. నాఫెడ్ సంస్థ తమకు భూమి కేటాయింపు ఆలస్యం అయినా అడ్వాన్స్ పొషెన్ 7ఎకరముల భూమి ఇవ్వవలెనని మరలా ఉత్తరం వ్రాశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖ యిచ్చిన ఉత్తర్వుల ప్రకారం జాతీయ రహదారి నెం. 40 కి తూర్పు పడమరలలో కేటాయింపు చేశారు. అలా కేటాయింపు చేయడం వలన గోదాముల నిర్మాణం జరపడం అసాధ్యం. కావున తమరు ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ కార్యదర్శి గారికి తెలియజేసి జాతీయ రహదారి నెం.40కి తూర్పు వైపు మిగిలిన 7 ఎకరముల పైచిలుకు భూమిని మొత్తం కేటాయింపు చేయించినచో రైతులకు అవసరమైన గోదాములు,ఇమండి మరియు రైతులకు వసతి కేంద్రము నిర్మాణములు త్వరితగతిన చేపట్టుటకుగాను అడ్వాన్సు పొషెషన్ యివ్వవలసిన అవసరం వున్నదన్న విషయం తెలియజేసి, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏర్పాటుకు సహాయ పడగలరని కోరినట్లు తెలిపారు.



## చంద్రన్న సుఖీభవ రైతుల ట్రాక్టర్లతో భారీ ర్యాలీ



**తంబళ్లపల్లె ఆగస్టు 11 ప్రభాతవార్త :**

గత వైకాపా ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా మోసం చేసిందని మా కూటమి ప్రభుత్వం రైతులను రాజులుగా నిలబెట్టి అండగా నిలిచినట్లు తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయచంద్ర రెడ్డి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సోమవారం మొలకలచెరువులో రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా నిధులు మంజూరు చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలపడానికి రైతులు భారీ ట్రాక్టర్లు ర్యాలీతో కదం తొక్కుతూ రైతు సంబర సభను ఓ పండుగ వాతావరణాన్ని మరిపించేలా విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి భారీగా తరలివచ్చిన రైతులు తంబళ్లపల్లె ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డిని ఘనంగా సన్మానించి ఆయనను ట్రాక్టర్లో ఊరేగించి హర్షాన్ని వ్యక్తం చేశారు. టిటిడి కళ్యాణ మండపం నుండి టమోటా మార్కెట్ వరకు వేలాది మంది రైతులు ర్యాలీలో పాల్గొని చంద్రన్న సుఖీభవ, జయచంద్ర రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి నినాదాలతో మొలకలచెరువు దద్దరిల్లింది. అనంతరం ఏఎంసి కేంద్రంలో జరిగిన రైతు సంబర సభలో జేసీఆర్ మాట్లాడుతూ నాడు వైకాపా ప్రభుత్వం రైతుకు మద్దతు ధర లేదని, 3000 కోట్ల ధరల స్థిరీకరణ గాలి మాటలేనని, వారు చేసింది దౌర్జన్యాలతో భూ కబ్జాలు, భూముల తాకట్టు, సినిమా పక్కిలో సాగునీరు లాంటి డ్రామాలు చేయడం తప్ప రైతుకు చేసిన అభివృద్ధి లేదని విమర్శించారు. తంబళ్లపల్లెలో కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ ద్వారా 44867 మంది రైతులకు రూ 31.40 కోట్లు లబ్ధి చేకూర్చిన ఘనత మాదేనన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త సీడ్ మల్లికార్జున్ నాయుడు, ఆరు మండలాల మండల స్థాయి నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓరియంటేషన్ కార్యక్రమం 2025




**కడప ఆగస్టు 11 ప్రభాతవార్త**

కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజ్ , 202526 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని విద్యార్థులకు స్వాగతం పలికింది. కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కాలేజ్ లో జాయిన్ అయ్యి ఉన్నత విలువలతో కూడిన ఉన్నత స్థానాలను చేరాలి అని అభినందిస్తూ, ఆక్టివ్ లిజనింగ్ స్కిల్ చేసుకోవాలని కోరారు. ఆకర్షణీయమైన మరియు ప్రభావవంతమైన కమ్యూనికేషన్ స్కిల్, ప్రభావవంతమైన వ్యక్తుల మధ్య సంబంధాలను నిర్మించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అని అన్నారు. కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ స్వీయస్థాన నిర్దేశం, విశ్వసనీయత నిర్మాణం మరియు ప్రభావవంతమైన కమ్యూనికేషన్, సమాజ పరివర్తనను నడిపించడంలో ఉద్దేశ్యంతో నడిచే నాయకత్వం యొక్క పాత్రను మరియు విద్య యొక్క ప్రాముఖ్యతను గురించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒకప్పటి కె ఎస్ ఆర్ ఎం పూర్వ విద్యార్థి 1985, 89 బ్యాచ్ విద్యార్థి అయినా డాక్టర్ ఎస్. వెంకట రమనయ్యా, ప్రొఫెసర్ ఐ ఐ ఎం లక్నో, ముఖ్య అతిథిగారు మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతను స్వీకరించడానికి, సాంప్రదాయ విజయానికి మించి ఆలోచించడానికి మరియు సమాజానికి అర్థవంతంగా దోహదపడటానికి తల్లి తండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్, వివిధ విభాగాధిపతులు , డీన్ లు, అడ్మిషన్ డిపార్ట్మెంట్ వారు పాల్గొన్నారు.

## బాగా శ్రమించి,ఉన్నత స్థితికి చేరుకోండి.




**కడప ఆగస్టు 11 ప్రభాతవార్త**

విద్యార్థినులు తాము ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కందుల విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే. చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు.నేడు కే ఎల్ ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు "ఓరియంటేషన్ కార్యక్రమం" ను ఉద్దేశించి మాట్లాడుతూ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి.రత్నమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. ముఖ్య అతిథి సయ్యద్ సానియా మాట్లాడుతూ కే ఎల్ ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఇంజనీర్లుగా తీర్చి దిద్దుకోవాలి అని కోరారు. తాను పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఇచ్చిన ప్రసంగం ఎంతో మందికి స్ఫూర్తి రగిలించిందని తెలిపారు.మొదట విద్యార్థినులు సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వాలని సమాజంలో జాగ్రత్తగా మసలుకోవాలి అని తెలిపారు. ఆ తర్వాత మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతి ప్రధానం చేశారు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమం ఆహుతులను అలరించింది.

## వికలాంగుల దరఖాస్తులు పరిశీలించాలని విజ్ఞప్తి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 11 , ప్రభాత వార్త**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వికలాంగులకు ముడు చక్రాల వాహనాలు,అంగవైకల్యం పరికరాలు, అందించే లా ప్రభుత్వం తరఫున అర్హులైన వారికి,సహకారం అందించాలని కోరుకుతూ సోమవారం బద్వేల్ మున్సిపాలిటీ కమిషనర్ నరసింహారెడ్డి కి వికలాంగుల దరఖాస్తు పత్రాలను ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా రాబోవు డిసెంబర్ డిసెంబర్ 3 ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగులకు సహాయ పరికరాలు మూడు చక్రాల వాహనాలు ఇవ్వాలని కోరారూ. అదేవిధంగా మున్సిపాలిటీలో వికలాంగులకు రావాల్సినటువంటి పథకాలు ప్రభుత్వం నుండి సహకారం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో అంగవైకల్య పరికరాల శిబిరం ఏర్పాటు చేయడం చాలా మందికి ఉపయోగకరంగా ఉందని తెలియ జేయడమైనది అందుకు కృతజ్ఞతలు తెలపడం అయినది అలాగే ప్రభుత్వం ఇస్తున్నటువంటి మూడు చక్రాల వాహనాలకు షరతులతో కూడినటువంటి పద్ధతులను కాకుండా అర్హత కలిగిన వికలాంగులకు తప్పకుండా వాహనాలు ఇచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేను ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన అర్హత కలిగిన వికలాంగులను లబ్ధిదారులుగా నమోదు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు గొడుగునూరు బాలరాజు, పట్టణ అధ్యక్షులు చింతకుంట రఫీ, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి ,తదితరులు పాల్గొన్నారు



# శాంతియుతంగా మొదటి సారి పులివెందులలోఎన్నికలు

**పులివెందుల, ఆగస్ట్ 11, ప్రభాత వార్త:**

పులివెందులలో కొన్ని దశాబ్దాల తర్వాత మొదట సారీ శాంతియుతంగా ప్రశాంతంగా ఉప ఎన్నికలు జరుగుతున్నా యనీ, అరాచకాలు దౌర్జన్యాలు కుట్రలు లేకుండా ఎన్నికలు జరగనున్నాయని ,ఆధారాలు లేకుండా పిటిషన్ వేసిన వైసీపీ కి వాటిని కొట్టివేసి చెంప దెబ్బ కొట్టినట్టు అయింది అని ప్రభుత్వ విప్ జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక తెదేపా కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ పులివెందుల మొదటిసారి ఉప ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిస్తు న్నామని కానీ వైసీపీ నేతలు రివర్స్ స్టేట్మెంట్స్ ఇస్తున్నార న్నారు.పులివెందుల మండలంలో వైకాపాకు వ్యతిరేకత టీడీపీకి అనుకూలత పెరిగింది అన్నారు.సమస్య చెప్పిన వెంటనే 48గంటల్లో ఎర్రబెల్లి చెరువుకి నీళ్ల సమస్య తీర్చడం గతం కంటే అన్నదాత సుఖీభవ కింద 6500 రూపాయలు ఎక్కవ ఇవ్వడం అరటి రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఇన్ పుట్ సబ్సిడీ ,ఆరు , నాలుగు వరుసల జాతీయ రహదార్లు , ఇక్కడికి వచ్చిన గృహ శాఖా మంత్రి 500 ఇళ్ళు మంజూరు చేస్తామని చెప్పడం , పింఛన్లు నాలుగు వేలకు పెంపు , కొత్తగా అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడం వలన పార్టీకి అనుకూలత ఏర్పడిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు మా దృష్టికి తెచ్చిన సమస్యలను ఎన్నికల కోడ్ అనంతరం వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.దీనితో వైకాపాకి ఓటమి భయం పట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు భక్తి పెరిగిందనీ ధర్మబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నాం అన్నారు. వైకాపా వారికి కూడా ఎంపీ,మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు ప్రచారం చేశారు అని జగన్ ను కూడా ఎన్నికల ప్రచారానికి రావాలని కోరాం అన్నారు. గతంలో నామినేషన్ లు కూడా వేయలేని పరిస్థితిని వైసిపి కల్పిస్తే మేము పులివెందుల, ఒంటిమిట్ట రెండు చోట్ల 11 మంది చొప్పున నామినేషన్ వేశారు అని కానీ మమల్ని దౌర్జన్యం చేస్తున్నారు అరాచకాలు చేస్తున్నారని నిందలు వేస్తున్నారన్నారు. దౌర్జన్యం వైకాపా వారికి ఒక ఆయుధమని మాకు అభివృద్ధి ఆయుధం అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోనూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోనూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ పోతుందన్నారు. గతంలోనే తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికల్లో వారు చేసిన తప్పులకు సంబంధించిన అధికారులు కూడా సస్పెండ్ అయ్యారన్నారు. కూటమి ప్రపంచంలోనే దేశాన్ని బలంగా నిలుపుతోందన్నారు. లిక్కర్ కేసులో కృష్ణ మోహన్ రెడ్డి ఇరుక్కు పోయారనీ ఇంకా 45 మంది పై కేసు నమోదైంది అని త్వరలో ఛార్జీ షీట్ వేయబోతున్నారన్నారు. ఇంకా నాలుగేళ్ల ప్రభుత్వం ఉంది ఇంకా అనేక సంక్షేమ అభివృద్ధి చేస్తామన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడిందన్నారు. 2019 నాటి ధైర్యం ఇప్పుడు జగన్ కు లేదు అన్నారు. ఎన్నికలపై ఐదారు రిట్లు వేశారు.ఏవీ విజయ వంతం కాదు అని తప్పుడు ఆరోపణతో రిట్ లు వేశారన్నారు.రాక్షసబల్లి అంతరించినట్లు, వైసీపీ అంతరించి పోతుందనీ ప్రజల మద్దతు మాకు సంపూర్ణంగా ఉందన్నారు. ఓటర్లకు మేము చెప్పిన దానిపై ఆకర్షితులు అయ్యారనీ పులివెందుల ప్రజలకి సంపూర్ణ స్వాతంత్రం ఆగస్టు 14 న ముందే రాబోతోందనీ తెలిపారు. ఎన్నిక నోటిఫికేషన్ నాటికి ఓట్ల షిఫ్టింగ్ జరిగిందనీ అపుడు అంతా మొద్దు నిద్రపోయి ఇప్పుడు వైసిపి హంగామా చేస్తుందనీ భయపెట్టేవాళ్లు భయపడుతున్నా రంటే ఓటమి అంగీకరిస్తున్నట్టే అన్నారు.వివేక హత్య కేసులో న్యాయం కోసం కుమార్తె సునీత పోరాడుతుందనీ ఆమె బాధ తీరాలని మేము కూడా కోరుకుంటున్నామన్నారు. కావున వైకాపా పార్టీని ప్రజలు నమ్ముకుంటే వారు పరిస్థితి గోవిందా అని కావున మిగిలిన వారు కూడా పార్టీని నమ్ముకోకుండా నమ్మకమైన పార్టీలను చూసుకోవాలి అని వారు ప్రజలకు ,వైకాపా నాయకులను కోరారు.



## ఆర్యవైశ్య వర్తక సంఘం వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజాకు ఘన సన్మానం



**బద్వేలు, ఆగస్టు 11, ప్రభాతవార్త**

ఇటీవల ఆర్యవైశ్య వర్తక సంఘం ఎన్నికలు నిర్వహించిన విషయం విధితమే. ఈ ఎన్నికలలో విజయం సాధించిన కొండపల్లి చిన్న సుబ్బారావు తో పాటు ఆదివారం వివిధ హోదాలలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో భాగంగా ఆర్యవైశ్య వర్తక సంఘం వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజా ఎన్నిక కావడంపై ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం బద్వేల్ మెడికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేవీ సుబ్బారావు, మరియు బద్వేల్ మెడికల్ అసోసియేషన్ సముద్రాల రాధాకృష్ణమూర్తి, ట్రెజరర్ సుధాకర్, బద్వేల్ మెడికల్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ సివి సుబ్బారెడ్డి, మరియు మంజు మెడికల్ స్టోర్ యజమాని పల్లేటి అమర్నాథ్ రెడ్డి లు కలిసి సుబ్బరాజాను ఘనంగా సత్కరించారు. ఆయన ఇలాగే దినదినాభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే వీరితోపాటు ఏపీయూ డబ్ల్యూజే సంఘం అధ్యక్షులు వెంకటేష్, పాత్రికేయులు గురు, శేఖర్ రాయల్, యర్రంరెడ్డి, ఉపాధ్యాయులు రవిశంకర్, పెద్దిరెడ్డి సుధాకర్, గాజు కుమార్, బిజెపి రమణయ్య దూదేకుల వీధి దాదా, కొప్పర్తి సత్యం, భార్గవ్ లతో పాటు పలువురు ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సుబ్బరాజా రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు.

## లయన్స్ క్లబ్ ప్లాటినమ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

**పీలేరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:**



లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎంఎన్ఆర్ కల్యాణమండపంలో 202526 నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ గవర్నర్లు వి. విజయభాస్కర్ రెడ్డి,సి.వి. భానుమూర్తిరెడ్డి తెలిపారు. లయన్ల క్లబ్ ప్లాటినమ్ అధ్యక్షులుగా గ్యారంపల్లె రమేష్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సురేష్, కోశాధికారిగా ఎ. శివఫణేష్ తోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా కార్యదర్శిగా కె. సంజీవరెడ్డి, జోనల్ చైర్మన్ గా బి. వేణుగోపాల్ ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సమాజంలో మరిన్ని సేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## 144 సెక్షన్ అమలు
### డిఎస్పీ మురళి నాయక్

**పులివెందుల , ఆగస్ట్ 11, ప్రభాత వార్త:**

జడ్పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా పట్టణ పరిధిలో 144 సెక్షన్ చేస్తున్నట్లు డి.ఎస్.పి మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఎవరు గుంపులు గుంపులుగా ఉండకూడదని, అలాగే అన్ని వ్యాపార సముదాయాలు మూసివేయాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా ఈ సెక్షన్ అమల్లో ఉంటుంది అన్నారు. ఊరేగింపులు,ర్యాలీలు చేయరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## వాస్తవాలు మాట్లాడితే బాగుంటుంది
### టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి

**పులివెందుల, ఆగస్ట్ 11, ప్రభాత వార్త:**

జడ్పిటిసి ఉప ఎన్నికల్లో టిడిపి పై ఎంపీ అవినాష్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పులివెందుల జరుగుతున్న జడ్పీ ఉప ఎన్నికలలో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో అన్ని రకాలగా ఎన్నికలను రద్దు చేయించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. నల్లగొండవారి పల్లి మరియు నల్లపురెడ్డి పల్లి గ్రామంలో కొన్ని ఓట్లు వేరే పోలింగ్ బూత్ లో పడిన విషయాన్ని తీసుకొని రాద్ధాంతం చేస్తూ హైకోర్టుకు ఎక్కడం జరిగిందన్నారు. దీంతో హైకోర్టు కూడా వారు అదే పంచాయతీలో ఉన్నారు కదా వేరే పంచాయతీలో లేరు కదా అని మార్చాలంటే కుదరదు అని స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ విషయం పైన మేము కూడా మా తెలియజేసి ప్రజలు ఇలా ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు చెప్పడం జరిగింది అన్నారు దానికి సంబంధించి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆర్టిసి బస్సులు ఉచితంగా నడిపి ఓటర్లను వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్ళేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. ఇక డబ్బులు విషయానికి వస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారు డబ్బులు పంపలేదా అని సూటిగా ప్రశ్నించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఏసుప్రభు ఫోటో తీసుకొని ప్రమాణం చేయాలన్నారు.







తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

**కడప జిల్లా**

పోరుమామిళ్ళ, చెన్నూరు, కొండాపురం, ఎర్రగుంట్ల రూరల్, గోపవరం, అట్లూరు, సికెదిన్నె, కడపక్రైమ్, చక్రాయపేట

**అన్నమయ్య జిల్లా**

చిన్నమండెం, వాయల్పాడు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాయచోటి, నందలూరు, కలకడ,

ఇంటర్వ్యూ తేది : 16.08.2025

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086